నేడు ఉండిలో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - ఉండి

మండల స్థాయిలో 'జగనన్నకు చెబుదాం' స్పందన కార్యక్రమాన్ని ఈ నెల 13వ తేదీ బుధవారం ఉండి మండలంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉండి ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తనతోపాటు జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత మండల అధికారులు పాల్గొంటారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉండి మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

విద్యా దీవెన జమయ్యేదెప్పుడో..!

- బటన్ నొక్కి 15 రోజులు గడిచినా ఖాతాల్లోకి రాని సొమ్ము
- ఫీజులు కట్టేందుకు తల్లిదండ్రులు నానావస్థలు
- రెండు జిల్లాల్లోనూ 63,847 మంది విద్యార్థులు
- ఇప్పటి వరకూ ఎంతమందికి జమైందో తెలియని అయోమయం
- ఇలాగైతే ఎలాగంటూ తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

విద్యార్థులకు అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన విద్యాదీవెన సొమ్ము విద్యార్థులకు సకాలంలో అందడం లేదు. దీంతో కాలేజీ యాజమాన్యాల ఒత్తిడితో ఫీజులు చెల్లించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు నానావస్థలు పడుతున్నారు. విద్యాదీవెన సొమ్ముకు సంబంధించి ఆగస్టు 28వ తేదీన సిఎం చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన సభలో బటన్ నొక్కారు. ఇది జరిగి 15 రోజులు గడిచినా ఇప్పటికీ విద్యా దీవెన సొమ్ము జమ కాకపోవడంతో తల్లిదండ్రుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. విద్యాదీవెన అందుకునే విద్యార్థులు ఏలూరు జిల్లాలో 31,859 మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 31,188 మంది మొత్తం 63,867 మంది ఉన్నారు. ఏప్రిల్ నుంచి జూన్ త్రైమాసికానికి సంబంధించిన విద్యాదీవెన సొమ్మును ప్రభుత్వం విడుదల చేసింది. ఏలూరు జిల్లాలో రూ.25.37 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో రూ.25.53 కోట్లు మొత్తం రూ.50.90 కోట్లు సొమ్ము జమ కావాల్సి ఉంది. రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ సగం మంది విద్యార్థులకూ సొమ్ము జమ కాలేదని తెలుస్తోంది. ఎంతమందికి జమైందో కూడా తెలియని అయోమయం నెలకొంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము సకాలంలో జమ కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ సచివాలయాలకు వెళ్లి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. త్వరలోనే జమవుతాయంటూ సచివాలయ ఉద్యోగులు సర్దిచెప్పి పంపిస్తున్న పరిస్థితి ఉంది. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన సొమ్ము ప్రభుత్వం నేరుగా కాలేజీలకు చెల్లించేది. దీంతో ప్రభుత్వం, కాలేజీ యాజమాన్యాల మధ్యే ఈ వ్యవహారం సాగేది. వైసిపి ప్రభుత్వం వచ్చాక ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లింపులకు సంబంధించి విద్యాదీవెన పథకం తెచ్చింది. విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు సొమ్మును నాలుగు విడతలుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తోంది. మొదట్లో సిఎం బటన్ నొక్కిన ఒకటి, రెండు రోజుల్లో విద్యాదీవెన సొమ్ము విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి చేరేవి. తల్లిదండ్రులు వెంటనే కాలేజీలకు చెల్లించేవారు. గడిచిన ఏడాదిగా విద్యాదీవెన సొమ్ముకు సంబంధించిన సిఎం బటన్ నొక్కినా రోజులు, నెలలు తరబడి సొమ్ము జమ కావడం లేదు. విద్యాదీవెన సొమ్మును ప్రభుత్వం విడుదల చేసింది కాబట్టి వెంటనే చెల్లించాలంటూ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయి. సొమ్ము జమ కాలేదని చెప్పినా విన్పించుకోవడం లేదు. తర్వాత జమవుతాయని, మీరు చెల్లించాలంటూ హుకుం జారీ చేస్తున్నాయి. దీంతో సామాన్య కుటుంబాలు పిల్లల ఫీజు కోసం నానావస్థలు పడుతున్నారు. విద్యాదీవెన ఒక్కటే కాదు, వసతిదీవెన సొమ్ము పరిస్థితీ ఇదేవిధంగా మారింది. ఫీజు సొమ్ము సకాలంలో ప్రభుత్వం జమ చేయకపోవడంతో విద్యార్థుల తల్లిందండ్రుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. అమ్మఒడి సొమ్ము సైతం ఇదేవిధంగా జమ కాకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాదీవెన సొమ్ము ఎప్పటికి జమవుతుందో సరైన సమాధానం చెప్పేవారే లేకపోవడంతో తల్లిదండ్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. విద్యాదీవెన సొమ్ము వెంటనే జమ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

గూడెంలో కురుస్తున్న వర్షం

తాడేపల్లిగూడెంలో కుండపోత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణంలో మంగళవారం ఉదయం కుండపోతగా వర్షం కురిసింది. సుమారు గంటన్నరపాటు ఏకధాటిగా వర్షం కురిసింది. పట్టణంలోని ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో అడుగు లోతు నీరు చేరింది. సుమారు గంటసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కడకట్ల, యాగర్లపల్లి, హౌసింగ్‌బోర్డు కాలనీలో లోతట్టు ప్రాంతాలు, వీధుల్లో వర్షపు నీరు భారీగా చేరుకుంది. గంటపాటు ఆర్‌టిసి బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. పట్టణంలో అవుట్‌లెట్ల నుంచి వర్షపు నీరు బయటకు ప్రవహించకపోవడంతో రోడ్లపైకి, పలు కాలనీల్లో లోతట్టు ప్రాంతాల్లోకి అడుగు లోతు వర్షపు నీరు చేరింది. ముఖ్యంగా మున్సిపల్ కార్యాలయం ఎదురుగా నీరు నిలిచిపోవడంతో పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. వెంకట్రామన్నగూడెం వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు నేలకొరిగాయి. వినాయక చవితి నిమిత్తం సిద్ధం చేసిన విగ్రహాలు వర్షంలో తడిసి కొంతమేర నష్టం వాటిల్లిందని స్థానిక వ్యాపారులు తెలిపారు.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

'నాడు-నేడు' పనులు సకాలంలో పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

నాడు - నేడు నిధులను సకాలంలో ఖర్చు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో నాడు-నేడులో చేపట్టిన పాఠశాలల మౌలిక వసతుల కల్పన, అదనపు గదులు, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత శాఖల ఇంజినీరింగ్ అధికారులు, ఎంఇఒలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనులు చేపట్టేందుకు నిధులున్నా ఖర్చు చేయకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత పనులను వెంటనే చేపట్టి నిధుల వినియోగంపై నివేదికను అందజేయాలన్నారు. పెయింటింగ్ పనులు పూర్తి కాకుండా ప్రారంభోత్సవం చేయొద్దని ఆదేశించారు. చిన్న చిన్న పనులుంటే పూర్తి చేసి స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రారంభోత్సవం చేయడానికి సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 25 నుండి నాడు-నేడు పనులను పరిశీలించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎం.బుక్, తీర్మానాలు, పేరెంట్స్ కమిటీ సమావేశాలు, చెక్ పేమెంట్ తదితర రిజిస్టర్లను సిద్ధంగా ఉంచాలన్నారు. తనిఖీల సందర్భంలో పొరపాట్లను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఇఒ ఆర్.వెంకటరమణ, పంచాయతీరాజ్ ఎస్ఇ రామస్వామి, ఇన్‌ఛార్జి మున్సిపల్ ఇంజినీర్ విజయ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, డిఇలు, ఎఇలు, ఎంఇఒలు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఓటర్ల జాబితా తయారీ

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా-2024 తయారీకి అన్నివిధాలా చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి తెలిపారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణకు సంబంధించి తొలగించబడిన ఓటర్ల జాబితా, ఇంటింటా వెరిఫికేషన్, ఎపిక్ కార్డుల ప్రింటింగ్, పంపిణీ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం ఉదయం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్ఒ కె.కృష్ణవేణి, ఇఆర్ఒలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధివిధానాల మేరకు జిల్లాలో ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. గత సంవత్సరం జనవరి ఆరో తేదీ నుంచి తొలగింపు ఓటర్ల జాబితా రీవెరిఫికేషన్ మేరకు చనిపోయిన వారు 33,277, పిఎస్ఇ, డిఎస్ఇలు 29,833, వేరే ప్రాంతానికి వెళ్లిన వారు 15,458 మొత్తం 78,568 మంది ఉన్నారన్నారు. రాజకీయ పార్టీల నుండి అందిన ఫిర్యాదుల పరిశీలన పూర్తయ్యిందని తెలిపారు. అనంతరం రాజకీయ పార్టీల సమావేశంలో నివేదికలను సైతం అందజేశామన్నారు. అనామలీస్ వెరిఫికేషన్‌లో ఇంటి నెంబర్‌కు సంబంధించి జంక్ క్యారెక్టర్లు ఉన్న వాటిపై, ఒకే ఇంటి నంబర్‌పై పది ఓట్లు నమోదు తదితరాలను పూర్తి స్థాయిలో పరిశీలన ఈ నెల 15 నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ఫిజికల్ వెరిఫికేషన్ గడువులోపు పూర్తి చేస్తామన్నారు. ఇంటింటి సర్వేలో ఓటరుగా నమోదు కాని వారిని గుర్తించి ఓటరు నమోదుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్ఒ కె.కృష్ణవేణి, భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, డిపిఒ జివికె.మల్లికార్జునరావు, జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఉద్యాన శాఖాధికారి ఎ.దుర్గేష్, డ్వామా పీడీ ఎస్‌టివి.రాజేశ్వరరావు, ఎన్నికల తహశీల్దార్ లక్కు నరసింహారావు, డిప్యూటీ తహశీల్దార్ సన్యాసిరావు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జెసి

సిఐ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం శ్రేణులు

జిల్లాలో విస్తరణాధికారుల నియామకం

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఐదుగురు విస్తరణాధికారులను ఉద్యోగోన్నతిపై నియమించినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ ఆదేశాలను అనుసరించి జిల్లాలో ఖాళీగా ఉన్న మండలాల్లో ఐదుగురి విస్తరణ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. భీమవరం జె.వెంకట రామేశ్వరరావు, తణుకు ఎఎస్ఆర్ కోటేశ్వరరావు, పాలకోడేరు కె.నాగేంద్ర కుమార్, ఆకివీడు కె.వెంకట సుబ్బారావు, వీరవాసరం టి.విజయ సారథులను విస్తరణాధికారులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

ఆకివీడులో గంజాయి అరికట్టండి

పోలీసులకు సిపిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఆకివీడు

రోజురోజుకీ పట్టణంలో పెరిగిపోతున్న గంజాయి ప్రభావాన్ని అరికట్టాలని ఆకివీడు సిఐ కె.సత్యనారాయణకు సిపిఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు ఆధ్వర్యంలో బృందం మంగళవారం సిఐ సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పట్టణంలో గంజాయి అమ్మకాలు, రౌడీయిజం, చిల్లరగ్యాంగ్ ఆగడాలు, అల్లరి మూకల స్వైరవిహారం రోజురోజుకీ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా పోలీసు సిబ్బంది లేకపోవడంతో సమస్యలు తీవ్రమవుతున్నాయన్నారు. దొంగతనాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయన్నారు. పాఠశాలలు, కళాశాలలు, రైల్వేస్టేషన్ కేంద్రాలు ఈ గంజాయి అమ్మకాలు పెరిగిపోయాయన్నారు. రౌడీమూకల ఆగడాలకు చీకటి పడితే ఇళ్లలో నుండి బయటకు రావడానికి భయపడే పరిస్థితి ఉందన్నారు. ఇవే పరిస్థితులు కొనసాగితే మరిన్ని ఘోరాలు చూడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు యంత్రాంగం వీటిపై ఉక్కుపాదం మోపాలని కోరారు. కార్యక్రమంలో నేతలు బొడ్డుపల్లి రాంబాబు, ఎస్‌కె.వలి, బివి.వర్మ, సందక సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాబ్జీ

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ఏలూరు టౌన్: విద్యార్థులు చక్కని క్రమశిక్షణతో బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. ఆయన మంగళవారం పరివర్తన్ వికలాంగుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా సాబ్జీ విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో చక్కని సదుపాయాలు ఉన్నాయని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విద్యాబోధన, భోజన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు, విద్యాబోధన, భోజన సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పరివర్తన్ వికలాంగుల పాఠశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరెడ్డి, పాఠశాల సిబ్బంది, డిడిఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐద్వా నేతలు

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రతిఘటించాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ

5న ఢిల్లీలో 'నారీ బచావో.. భారత్ బచావో' సభ

ప్రజాశక్తి - భీమవరం

కులతత్వం, మతతత్వం పెంచి పోషిస్తూ మహిళా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రతిఘటించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఐద్వా జిల్లా కమిటీ సమావేశం కేతా పద్మజ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో పూర్ణ మాట్లాడుతూ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రతిఘటించి మహిళలను, దేశాన్ని రక్షించుకునేందుకు అక్టోబరు 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 76 ఏళ్లు పూర్తయిందని, బ్రిటీష్ పాలకులను మన దేశం నుంచి వెళ్లగొట్టడానికి భారతదేశంలో ఉన్న అన్ని కులాలు, మతాల ప్రజలు కలిసి భిన్నత్వంలో ఏకత్వం నినాదంతో స్వాతంత్రాన్ని సాధించారని గుర్తు చేశారు. నేటికీ కూడు, గుడ్డ, గూడు, విద్య, వైద్యం వంటి కనీస అవసరాలు 30 శాతం మందికి ఇంకా అందట్లేదన్నారు. అవినీతి తారాస్థాయికి చేరిందని, రోజురోజుకీ నిరుద్యోగం తీవ్రమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి లేక మహిళలు నానావస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వీర్యం కావడంతో పేదలు కడుపు మాడ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. విశాఖ ఉక్కు, ప్రకృతి వనరులను అంతర్జాతీయ పరిశోధనా సంస్థలతో సహా జాతి సంపదను తెగనమ్మి మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతుందని మండిపడ్డారు. ప్రజలపై విద్యుత్ ఛార్జీలు, చెత్త పన్ను, అధిక ధరలు పేరిట భారాలు మోపుతున్నారని విమర్శించారు. మనువాద సిద్ధాంతాన్ని ముందుకు తీసుకొచ్చి భరతమాత అంటూనే స్త్రీలపై ఆంక్షలు విధిస్తున్నారన్నారు. అక్టోబర్ 5న ఢిల్లీలో 'భారత్ బచావో.. నారీ బచావో' నినాదంతో సభ నిర్వహిస్తున్నామని, దీనిలో జిల్లాలోని మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నేతలు ఎస్.ఉదయకుమారి, ఎస్.జయప్రభ, బి.యశోద, ఎం.సరోజిని, పావని, సత్యవతి, రాణి, ప్రశాంతి, సుగుణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు సచివాలయ సెక్రటరీ

ప్రజాశక్తి - ఏలూరు

నగరంలో 26వ నెంబర్ సచివాలయంలో ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న మానుకొండ రాజకుమార్ ఇటీవల విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన కబడ్డీ, రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ రాజకుమార్‌కి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత మంచి పేరు కార్పొరేషన్ తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాజకుమార్‌కు సచివాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

రాజకుమార్‌ను అభినందిస్తున్న కమిషనర్

వీరవాసరం ఇఒపిఆర్‌డిగా ముదినేపల్లి కార్యదర్శి

ముదినేపల్లి: ముదినేపల్లి పంచాయతీ కార్యదర్శి టివి సారధికి ఇఒపిఆర్‌డిగా ఉద్యోగోన్నతి లభించింది. సారధి బదిలీపై పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండల ఇఒపిఆర్‌డిగా నియమి తులయ్యారు. సారధి సుదీర్ఘ కాలంగా మండలంలోని పలు పంచాయతీల్లో కార్యదర్శిగా విధులు నిర్వహించారు. కొన్నాళ్లుగా ఆయన ముదినేపల్లి ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డిగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. సారధి స్థానంలో ముదినేపల్లి ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శిగా చిరుగుకోట పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

మహిళా ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు రేంజి పరిధిలో మహిళా ఎస్ఐల ప్రిలిమినరీ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు శారీరక దారుఢ్య పరీక్షలను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పెరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించారు. అభ్యర్థినులకు ఎత్తు, 1600 మీటర్ల పరుగు పందెం, 100 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్ పోటీలను నిర్వహించారు. మొత్తం 535 మంది అభ్యర్థులకు అడ్మిట్ కార్డ్‌లు ఇచ్చామని, 260 మంది మహిళా అభ్యర్థులకు మంగళవారం పరీక్షలు నిర్వహించామని డిఐజి జివిజి అశోక్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షల్లో భాగంగా పురుషులు 4,581 మంది హాజరవ్వగా, 3,233 మంది అర్హత సాధించారని చెప్పారు. మహిళలు 1,177 మంది హాజరవ్వగా 607 మంది అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి, జిల్లా ఎఎస్‌పి ఎంజెవి భాస్కరరావు, అధికారులు బిఎన్‌వి సాయి ఈశ్వరరావు, లతకుమారి, డాక్టర్ పోతుమూరి శ్రీనివాసు, డాక్టర్ శ్రీజ, ఎస్ఐలు, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

హామీ ఇచ్చారు.. అమలు మరిచారు..!

కాంట్రాక్టు విద్యుత్ ఉద్యోగుల ఆవేదన

ప్రజాశక్తి - పాలకొల్లు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటికీ ఆ హామీలు నెరవేర్చలేదని, ఇలా అయితే తాము ఎలా బతకాలని విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా అమలు చేయడం లేదని వాపోయారు. రూ.36,000 వేల వేతనం ఇవ్వాల్సి ఉన్నా రూ.27,000 వేలు మాత్రమే ఇస్తున్నారని పలువురు ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని చలో విజయవాడకు పిలుపునిస్తే పోలీసులు 144 సెక్షన్, 30 యాక్ట్ పేరున అనుమతి లేదని తిరస్కరించారని వాపోయారు. ఇచ్చిన హామీలు అమలు చేసి తమ కుటుంబాల్లో వెలుగులు నింపాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేసుకుంటున్నారు. అలాగే విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి విద్యుత్ యాజమాన్యమే ఆర్‌టిసి వలే నేరుగా వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. 33/11 కెవి సబ్‌స్టేషన్‌లో ఒంటరిగా విధులు నిర్వర్తిస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లకు సహాయంగా వాచ్‌మెన్‌లను వెంటనే నియమించాలని, ఎపి ట్రాన్స్‌కో వివిధ కారణాలతో ఏర్పడిన ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విధి నిర్వహణలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందితే రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుచున్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు గాయపడిన కార్మికుడికి విద్యుత్ సంస్థచే ఉచిత వైద్య సదుపాయం, పూర్తిగా కోలుకునే వరకూ వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కామన సంజయ్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు

ఎన్నో ఏళ్లుగా చాలీచాలని జీతంతో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి. ఆర్‌టిసి మాదిరిగా దశల వారీగా కాంటాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి తాము నిరంతరం కరెంట్ అందజేశాం. కరోనా సమయంలో మృతి చెందిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలి.

సిఎం జగన్ హామీ నెరవేర్చాలి

పి.నాగబాబు, షిఫ్ట్ ఆపరేటర్, పాలకొల్లు

సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చాలి. కాంటాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలి. తెలంగాణ మాదిరిగా ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి.

ఇలా అయితే ఎలా..

టి.రమేష్, షిఫ్ట్ ఆపరేటర్, పాలకొల్లు

చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యమంత్రి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంత వరకూ అమలు చేయలేదు. ఇలా అయితే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలి. కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేసేలా ఎపి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

రోటరీ క్లబ్ ఆధ్వర్యాన 'పర్యావరణ పరిరక్షణలో మన పాత్ర' అంశంపై కాలేజీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు స్థానిక లజపతిరాయి పేటలోని మాంటిస్సోరీ జూనియర్ కాలేజీలో మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి జూనియర్స్, సీనియర్స్ విభాగం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు విద్యార్థులకు అందజేస్తామని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ రావాడ సతీష్, ట్రెజరర్ ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్, అసిస్టెంట్ గవర్నర్ ఇమ్మిడి రాజేష్, పాస్ట్ ప్రెసిడెంట్లు చందక రాము పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో అన్నాక్యాంటీన్ వద్ద భోజనం తింటున్న పేదలు

పలుచోట్ల అన్నా క్యాంటీన్ల నిర్వహణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) ఆధ్వర్యంలో అన్నాక్యాంటీన్ 57వ వారం పట్టణ అధ్యక్షులు పట్నాల రామపండు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దొడ్ల బాలాజీ కుమారుడు పార్థు పుట్టినరోజు సందర్భంగా సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో కిలాపర్తి వెంకటరావు, వాడపల్లి సుబ్బరాజు, ఆకాశపు స్వామి, బండి పెద్దిరాజు, మునగపాటి పరుశురాం, ముప్పిడి రమేష్ పాల్గొన్నారు.

పాలకొల్లు :పట్టణంలో అన్నా క్యాంటీన్ వద్ద 995వ రోజు తన తండ్రి పీతల బాబ్జీ (వరప్రసాద్) 4వ వర్ధంతి సందర్భంగా మంగళవారం మాజీ మంత్రి పీతల సుజాత పేదలకు ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు. వారికి ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గండేటి వెంకటేశ్వరరావు, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఆటల పోటీలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు ఎస్‌విజిహెచ్ హైస్కూల్ ప్రాంగణంలో ఈ నెల 13వ తేదీన మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు పిటి కర్రి కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు అండర్-14, అండర్-17 కింద విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. అలాగే పెనుమంట్ర, మాముడూరు, జుత్తిగ, పొలమూరు, ఆలమూరు, మార్టేరు ఎస్‌విజిహెచ్, మార్టేరు బసంతి దేవి బాలికల హైస్కూల్, నెగ్గిపూడి గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు విచ్చేస్తారని తెలిపారు.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పల్లపు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి - మొగల్తూరు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా మొగల్తూరులోని గాంధీ బొమ్మల సెంటర్, స్టేషన్ రోడ్డు, గొల్లగూడెం, మసీదు సెంటర్, కెపిపాలెంలో ఉన్నత పాఠశాల ప్రాంతంలో, పేరుపాలెం నాలుగు రోడ్ల సెంటర్, కాళీపట్నం పడమరలోని ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

చంద్రబాబు బయటకు రావాలని పూజలు

ప్రజాశక్తి - ఆకివీడు

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై మోపిన అభియోగాలు తొలగిపోయి జైలు నుంచి వెంటనే బయటకు రావాలని కోరుతూ ఎంఎల్ఎ మంతెన రామరాజు, టిడిపి శ్రేణులు పలు దేవాలయాల్లో మంగళవారం పూజలు చేయించారు. మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి స్థానిక పెద్దింట్లమ్మ దేవస్థానం, ఆంజనేయ స్వామి వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తదితర దేవాలయాల్లో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మోటుపల్లి రామ వరప్రసాద్, రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు గోంట్ల గణపతి, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బొల్ల వెంకట్రావు, గంధం ఉమా సత్యనారాయణ, గుడిగంటల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: చంద్రబాబు నాయుడుపై ఆధారం లేని ఆరోపణలు చేసి కక్షపూరితంగా జైలుకు పంపించారని టిడిపి మండల అధ్యక్షులు కోడి విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. యాళ్లవానిగరువులో టిడిపి మండల అధ్యక్షులు కోడి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నిప్పులా తిరిగి వస్తారని ఆకాంక్షించారు. ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో అనేకమైన నిరసన కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు రాయి ప్రసాద్, ఇంటి శ్రీరాములు, కౌరు మురళి, దొడ్డ శ్రీనివాస్, కట్ట మురళి, సాగ సత్యనారాయణ, అందే కోటి వీరభద్రం నిమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్ పట్టించుకోవడం లేదు : తాతాజీ

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో చంద్రబాబు అరెస్ట్‌ను ప్రజలెవరు పట్టించుకోవడంలేదని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ చెప్పారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వాస్తవాలను జీర్ణించుకోలేకపోతున్న బాలకృష్ణను రంగంలోకి దింపి ఆందోళనలు చేయాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టెక్నాలజీ పెరిగిన తర్వాత తప్పు చేసిన వారిని ప్రోత్సహించే పరిస్థితి లేదని చంద్రబాబు సంఘటనే ఉదాహరణ అన్నారు. పవన్ కళ్యాణ్ చంద్రబాబు అరెస్ట్‌ను వ్యతిరేకిస్తూ రోడ్డు మీద పడుకోవడం, స్కామ్ చేసిన వారికి అండగా నిలిచే పవన్ 2024 ఎన్నికల్లో ఓట్లు తమకే వేయాలని ఏ విధంగా ప్రజలను అడుగుతారో ఆయనకే తెలియాలన్నారు. పక్కా ఆధారాలతో దొరికిన చంద్రబాబు నైజం చూసి ప్రజలు ఛీదరించుకుంటున్నారని తెలిపారు.

నేడు నవుడూరువానిగరువులో పొలంబడి

మొగల్తూరు:మండలంలోని శేరేపాలెం పంచాయతీ పరిధి నవుడూరు వాని గరువులో పొలంబడి కార్యక్రమం ఈనెల 13వ తేదీన బుధవారం నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ తెలిపారు. గ్రామంలోని రైతులంతా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

రైలు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

తాడేపల్లిగూడెం:స్థానిక రైల్వే బ్రిడ్జ్ కింద రైలు ఢీకొని వ్యక్తి తీవ్ర గాయాలపాలైన ఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు క్షతగాత్రుడుని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ప్రమాదానికి గురైన వ్యక్తి పెంటపాడు గ్రామానికి చెందిన తోట శాంతకుమార్ అని, 25 సంవత్సరాల వయస్సు ఉంటుందని, బంధువులకు సమాచారం అందించామని తెలిపారు. బంధువులు ఆసుపత్రికి చేరుకున్నారు.పరిస్థితి విషమంగా ఉండడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు రైల్వే ఎస్ఐ జి.హరిబాబు తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పార్టీలు ముఖ్యమా.. అభివృద్ధి ముఖ్యమా

వైసిపి నేతలను ప్రశ్నించిన ఎంపిపి దుర్గాభవాని

మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దుర్గాభవాని

ప్రజాశక్తి - వీరవాసరం

పార్టీలు ముఖ్యమా అభివృద్ధి ముఖ్యమో వైసిపి నేతలు ఆలోచించుకోవాలని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని తెలిపారు. మండల పరిషత్ సమావేశం ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అధ్యక్షతన ఎంపిడిఒ జ్యోతి ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండల పరిషత్ ద్వారా పట్టుబట్టి నిధులు కేటాయించుకున్న కొంతమంది వైసిపి సర్పంచులు దానికి అవసరమైన పంచాయతీ తీర్మానాలు ఇవ్వడంలో రాజకీయ వైఖరి అవలంబిస్తూ పార్టీల పేరుతో పంతాలు చూపడం సరికాదన్నారు. పార్టీలు ముఖ్యంకాదనే భీమవరం ఎంఎల్ గ్రంధి శ్రీనివాస్ ప్రతిపాదించిన పనులకు కూడా మండల పరిషత్ నుండి నిధులు కేటాయించడం జరుగుతుందన్న విషయాన్ని వైసిపి నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. కొంత మంది వైసిపి సర్పంచులు మండల పరిషత్ నిధులతో తమ గ్రామాలను అభివృద్ధి చేసుకుంటుంటే వీరవాసరం అభివృద్ధికి రూ.25 లక్షలు ఎంపిటిసిల కోటాలో కేటాయించి రెండు సంవత్సరాలు కావస్తున్నా వీరవాసరం పంచాయతీ నుంచి తీర్మానాలు ఇవ్వకపోవడం దేనికి సంకేతమని సమావేశంలో ఎంపిపి ప్రశ్నించారు. అయితే నిధులిస్తే అభివృద్ధి చేసుకుంటామంటూ బాలేపల్లి సర్పంచి యర్రంశెట్టి శ్రీనివాస్ ముందుకొచ్చారు. ఇటీవల వీరవాసరం పిహెచ్‌సిలో జరిగిన పరిణామాల పట్ల, వైద్యాధికారి సత్యనారాయణరాజు పట్ల ఎంపిపి అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారి, సిహెచ్‌ఒల మెతక వైఖరి వల్లే హెల్త్ అసిస్టెంట్లు ఇతర సిబ్బందిపై పెత్తనం చెలాయిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. శాఖలవారీ సమీక్షలో భాగంగా వ్యవసాయ యాంత్రీకరణను రైతులకు వ్యక్తిగతంగా అమలు చేయాలని ఎంపిటిసి గుళ్లిపల్లి విజయలక్ష్మి వ్యవసాయాధికారి బిన్సీబాబు దృష్టికి తీసుకొచ్చారు. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులకు త్వరలోనే ఆన్‌లైన్‌లోకి ఎక్కించడం జరుగుతుందని ఎఒ తెలిపారు. ఎంపిటిసిలంటే కొంత మంది సర్పంచులకు గౌరవం లేదని ఎంపిటిసిలు తీసుకొచ్చిన నిధులకు పంచాయతీలు తీర్మాణాలు ఇవ్వకపోవడం పట్ల పలువురు ఎంపిటిసిలు అసంతృప్తి వ్యక్తం చేశారు. నవుడూరులో సరైన దారి లేకపోవడం వల్ల జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు రావడం లేదని ఎంపిటిసి ఇందిర హౌసింగ్ ఎఇ దృష్టికి తీసుకరావడంతో అది వాస్తవం కాదని ఎఇ వివరణ ఇచ్చారు. అదేవిధంగా తమ సమస్యల పట్ల అధికారులను ప్రశ్నిస్తుంటే ప్రతి విషయానికీ అడ్డుతగులుతున్నాడంటూ మత్స్యపురి సర్పంచి కారిపెల్లి శాంతిప్రియ, సమావేశంలో దురుసుగా వ్యవహరిస్తే సహించేది లేదంటూ ఎంపిపి దుర్గాభవాని, బొబ్బనపల్లి సర్పంచి గూడూరి ఓంకారం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పలు అభివృద్ధి పనులను సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

పింఛను పంపిణీ చేస్తున్న సర్పంచి దేవేంద్రుడు

ప్రజాశక్తి - పెనుమంట్ర

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కుల, మత, రాజకీయాలకు అతీతంగా కొత్త పెన్షన్లు ఇవ్వడం గర్వించదగిన విషయమని మాముడూరు సర్పంచి గూడూరి దేవేంద్రుడు అన్నారు. గ్రామంలో నూతనంగా మంగళవారం ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీ రాజు సహకారంతో మొదటి విడతలో 12, రెండో విడతలో 33, మొత్తం 45 మందికి మంజూరైన పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవేంద్రుడు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా ఇక్కడ అర్హులందరికీ తగిన సమయంలో పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి వాసంశెట్టి కిరణ్, వైస్ ప్రెసిడెంట్ రవిలిసెట్టి నరసింహారావు, సొసైటీ ఛైర్మన్ దాట్ల చంటిరాజు, మాజీ జెడ్‌పిటిసి వీరవల్లి తాతాజీ, అధ్యక్షులు బోగిరెడ్డి మారుతిరావు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శాశ్వత అన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - కాళ్ల

సీసలి గ్రామంలో షిరిడీ సాయిబాబా ఆలయంలో శాశ్వత అన్నదాన పథకానికి భీమవరానికి చెందిన బెల్లంకొండ షణ్ముఖ జ్ఞాపకార్థం అల్లుడు, కుమార్తె మన్నే రాజారమేష్, శైలజ దంపతులు రూ.1,00,000 విరాళాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్‌పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతీదేవి మాట్లాడుతూ శాశ్వత అన్నదాన పథకానికి లక్ష రూపాయలు ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం దాతలను శేషవస్త్రం, బాబా వారి ప్రతిమతో సత్కరించారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని జగనన్న లేఔట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ ఉంద్రు బాబ్జి రాజు ఆ శాఖ సిబ్బందికి సూచించారు. కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.12,000 నిధులు మంజూరు చేయనుందన్నారు. కాలనీలో స్వాగతం ద్వారా నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఫణీంద్ర, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - పెనుగొండ

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయ కుమారి తెలిపారు. వెంకటరావుపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయ కుమారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి అనంతలక్ష్మి మాట్లాడుతూ పాలు, గుడ్లు, బాలామృతం అందజేయాలన్నారు. ఐదు సంవత్సరాల్లోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనతను అధిగమించొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ అటానమస్ కళాశాలలో మాథ్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, ఎంఎస్‌సి ఆక్వాకల్చర్, సబ్జెక్టుల్లో అతిథి అధ్యాపకుల నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ ఆక్వాకల్చర్, జువాలజీ, ఎంసిఎ, ఎంటెక్, డిగ్రీ కనీసం 55 శాతం పైన మార్కులున్న అభ్యర్థులు అర్హులని తెలిపారు.అదనపు అర్హతలు పిహెచ్‌డి, బోధన అనుభవం కలిగి ఐసిటి టూల్స్ ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానం ద్వారా బోధించగల అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులు, సర్టిఫికెట్లు ఈనెల 18వ తేదీలోపు కళాశాల ఆఫీసులో అందజేయాలని, మెయిల్ ద్వారా పంపాలని తెలిపారు. అభ్యర్థులు ఈనెల 21 ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి

మాజీ ఎంఎల్ఎ శివ

ప్రజాశక్తి - ఉండి

కార్యకర్తలందరూ ధైర్యంగా ఉండాలని మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటనన విడుదల చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కక్షపూరితంగా వ్యవహరించి చంద్రబాబు నాయుడును అరెస్టు చేయించారన్నారు. వేలాదిమంది యువతకు స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ ఇవ్వడంతో ఉపాధి పొందారన్నారు. ఇటువంటి కుట్రలను టిడిపి ఎన్నో ఎదుర్కొందని, నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేశారని ఇప్పుడు కూడా అదే విధంగా ధైర్యంగా ఉండాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ ఉంద్రు బాబ్జిరాజు

30 నుంచి ఆరోగ్య శిబిరాలు

ఎంపిడిఒ ఉంద్రు బాబ్జిరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

ఈనెల 30వ తేదీ నుంచి మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఉంద్రు బాబ్జిరాజు తెలిపారు. మొగల్తూరులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద మంగళవారం గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎఎన్‌ఎమ్, మహిళా పోలీసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఎఎన్‌ఎంలు, వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి వారి ఆరోగ్య పరిస్థితి నమోదు చేయాలని సూచించారు. సచివాలయాల పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతమయ్యేలా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి మేడిది నవీన్ కిరణ్ పాల్గొన్నారు.

'తూర్పు కాపుల సమస్యల పరిష్కారానికి కృషి'

ప్రజాశక్తి - పాలకొల్లు

తూర్పు కాపులను ఒబిసిలో చేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించినట్లు వైసిపి పాలకొల్లు ఇన్‌ఛార్జి గుడాల గోపి తెలిపారు. తూర్పుకాపుల ప్రతినిధి బృందం మంగళవారం అమరావతిలో గోదావరి జిల్లాల వైసిపి సమన్వయకర్త మిథున్ రెడ్డిని కలిసినప్పుడు ఆయన హామీ ఇచ్చినట్లు మీడియాకు తెలిపారు. రెండు రోజుల క్రితం తూర్పు కాపులు పాలకొల్లులో సమావేశం ఏర్పాటు చేసుకొని తనను పిలిచి మమ్ములను ఒబిసిలో కలిపేందుకు మెమోరాండం ఇచ్చినట్లు తెలిపారు. వెంటనే హుటాహుటీన తూర్పు కాపు పెద్దలందరినీ మిథున్ రెడ్డి దగ్గరికి తీసుకువెళ్లి వారికి కూడా మెమోరాండం ఇచ్చిన వెంటనే తూర్పు కాపుల సమస్య పరిష్కరిస్తానని మిథున్ రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట వైసిపి నేత గుణ్ణం నాగబాబు, తూర్పు కాపు పెద్దలు చందక సత్తిబాబు, మురళీ, ఇజ్జాడ చినబాబు, శ్రీనివాస్ ఉన్నారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.1766/2022
Between:
Kalidindi Venkata Rama Krishna Raju ...Plaintiff
And:
Kaki Appa Rao & another ...Defendants
SUMMONS
To,
D-1: Kaki Appa Rao, S/o.Sankarayya, Hindu, aged 40 years, R/at D.No.1-6, Pulaparthi Post, Yellamanchili Mandal, Visakha District Presently R/at C/o. Gangisetty Suryanarayana, Desalamma Temple, 2nd lane, Chintal Thota, Palakollu, W.G. District.
D-2: Kaki Venkata Saraswathi, W/o.Kaki Appa Rao, Hindu, aged 35 years, R/at D.No.1-6, Pulaparthi Post, Yellamanchili Mandal, Visakha District
Please take notice that the above named plaintiff has instituted the above suit against both of you for recovery of an amount of Rs.2,56,000/- and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to 27-09-2022 for your appearance. Therefore, you are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on 27-09-2022 at 10:30 A.M in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.
S.S. REDDY & D.S. RAMA RAJU
Advocates
Visakhapatnam

In The Court Of The Principal Senior Civil Judge :: Eluru
F.D.I.A.No. 233/2021
O.S.No. 229/2017
Between:
Maddula Lakshmi Kumari ...Petitioner /Plaintiff
AND
Matta Naga Praveen Kumar ...Respondent /Defendant
Respondent /Respondent:
Matta Naga Praveen Kumar, S/o. Rambabu, Hindu, Male, Age 36 Yrs, R/o. Vijayarai (V), Pedavegi (M), Eluru District.
పై నెంబరు నందు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున ది.25-09-2023న ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు గాని, మీ ప్లీడరు గారు గాని హాజరు కావలెను. లేని ఎడల పరోక్షముగా తీర్మానించబడును.
కె.వి.ఆర్.కె.సుబ్బారావు
అడ్వకేట్, ఏలూరు.
సెల్:93917 66444

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, తణుకు
O.S. No. 169/2008
Between:
వాది: షేక్ పీర్‌భాషా
మరియు
ప్రతివాదులు: శీలబోయిన వెంకటేశ్వరరావు మరియు వగైరా
8వ ప్రతివాది: వెన్నాడ వెంకటలక్ష్మి, W/o. అంబికా ప్రకాష్, దంతుపల్లి, అత్తిలి మండలం.
పై నెంబరు గ్రంథములో శ్రీ కోర్టు వారు పలుమార్లు మీయొక్క Appearance నిమిత్తం సమన్లు ఆర్డరు వేసినప్పటికీ మీరు తీసుకొనక కాలయాపన చేసినందున మీ యొక్క Appearance నిమిత్తం ది. 14-09-2023 ఉదయం 10 గం॥ 30 ని॥లకు వాయిదా వేసియున్నారు. కావున మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు కాని యెడల మీకు పరోక్షము గావింపబడుదునని మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
N.V.S.S.P.RAMA MOHAN
N.V.S.RAMNUJUM
తణుకు Advocates, Tanuku
ది.11-9-2023 Cell: 9848368653

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, తణుకు
O.S. 533/2019
Between:
Plaintiff: State Bank of India, Main Branch, Tadepalligudem
Defendant: Katta Padmavathi
To:
Katta Padmavathi, D/o. Venkateswara Rao, Door No. 44-34, Relangi Village, Iragavaram Mandalam, TNK JCJC.
పై నెంబరు దావాలో ప్రతివాదికి ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను సదరు దావా సంగతులు తెలిసియుండి సదరు సమన్లు తీసుకొనకుండా Evade చేయుచున్నందున Substituted Service ద్వారా అమలు జరుపుటకు ఉత్తర్వులు యిచ్చి ది. 22-09-2023 కి వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు వాయిదా రోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు పై నంబరు దావా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
PASUPULETI SRINIVAS
Tadepalligudem Advocate for Plaintiff
Date: 30-08-2023 Tadepalligudem

నోటీసు
మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ప॥గో॥జిల్లా Cum మోటార్ ఏక్సిడెంట్స్ క్లయిమ్ ట్రిబ్యునల్, ఏలూరు వారి కోర్టులో
M.V.O.P. 49/2023
Between:
గెడ్డం నాగరాజు -పిటీషనరు
AND
జి.ఎన్.వి.ప్రసాద్, వగైరా -రెస్పాండెంట్లు
పై నంబరు పిటీషనులో 2వ రెస్పాండెంటు అయిన వెలిగట్ల శ్రీనివాసరావు, S/o. ముసలయ్య, డో.నెం. 3-321-12, దుర్గా ఇండేన్ గ్యాస్ గొడౌన్ వద్ద, పాలంగి గ్రామం, ఉండ్రాజవరం మండలం, ప॥గో॥జిల్లా
అనువారికి నోటీసులు అమలు కొరకు ది. 15-9-2023వ తేదీకి వాయిదా అయివున్నది. సదరు వాయిదా రోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు అయి ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారి పరోక్షమందు పిటీషను సంగతులు తీర్మానించెదరు.
తోట వీర వెంకట సత్యనారాయణస్వామి
న్యాయవాది
ఏలూరు నరశింహారావుపేట (ఆఫీసు)
12-9-23 ఏలూరు, సెల్:9848232765